# వేశ్య కథకు ఆస్కార్ పురస్కారం

**ఐదు అవార్డులను గెలుచుకున్న 'అనోరా' • భారత్ నుంచి 'అనూజ'కు నిరాశ • అట్టహాసంగా జరిగిన 97వ ఆస్కార్ ప్రదానోత్సవం**



ప్రపంచ సినీ ఉత్సవంగా అభివర్ణించే ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం లాస్‌ఏంజిల్స్‌లో డాల్బీ థియేటర్‌లో తారల తళుకుబెళుకుల నడుమ కన్నులపండువగా జరిగింది. అతి తక్కువ బడ్జెట్‌లో ఓ వేశ్య నేపథ్య కథాంశంతో రూపొందించిన 'అనోరా' చిత్రం ఈ ఏడాది ఐదు పురస్కారాలను గెలుచుకొని అగ్ర భాగాన నిలిచింది. సీన్ బేకర్ దర్శకత్వంలో రొమాంటిక్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆస్కార్ బరిలో పదమూడు నామినేషన్స్ దక్కించుకున్న మ్యూజికల్ డ్రామా 'ఎమిలియా పెరెజ్' కేవలం రెండు అవార్డులకే పరిమితమైంది. ఇక ఈ ఏడాది అవార్డుల్లో భారతీయ చిత్రాలకు నిరాశే ఎదురైంది. లైవ్ యాక్షన్ షార్ట్‌ఫిల్మ్ కేటగిరీలో భారత్ నుంచి పురస్కారం గ్యారంటీ అని భావించిన 'అనూజ' చిత్రానికి అదృష్టం కలిసి రాలేదు. బుల్లితెర ప్రయోక్తగా పేరుపొందిన కానన్ ఓ బియన్ ఈ 97వ ఆస్కార్ వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఇటీవల లాస్‌ఏంజిల్స్ కార్చిచ్చు దుర్ఘటనలోని మృతులకు నివాళులర్పించిన అనంతరం ఆస్కార్ ప్రదానోత్సవ ఘట్టాన్ని ఆరంభించారు.

## ఓ వేశ్య కథ 'అనోరా'

రొమాంటిక్ కామెడీ డ్రామాగా తెరకెక్కిన 'అనోరా' ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ నటి, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, ఉత్తమ ఎడిటింగ్ విభాగాల్లో పురస్కారాలను గెలుచుకొని సంచలనం సృష్టించింది. సీన్ బేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మైకీ మ్యాడిసన్, మార్క్ ఎడిల్జియన్, యురా బోరిసావ్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే.. అమెరికా బ్రూక్లిన్‌లో నివసించే అని అనే ఓ స్ట్రిప్ డ్యాన్సర్ కథ ఇది. వృత్తిలో భాగంగా ఆమెకు రష్యా సంపన్న కుటుంబానికి చెందిన వన్య అనే వ్యక్తి పరిచయం అవుతాడు. ఇద్దరూ పెళ్లి చేసుకుంటారు. ఈ విషయం తెలుసుకున్న వన్య తల్లిదండ్రులు పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ధనవంతుడైన తమ కుమారుడ్ని మోసం చేసి పెళ్లిచేసుకుందని అనీని నిందిస్తారు. తమ కుమారుడ్ని వదిలేస్తే పదివేల డాలర్లు బహుమతిగా ఇస్తామని ఆశచూపిస్తారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇద్దరు ప్రేమికుల జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందన్నదే ఈ సినిమా ఇతివృత్తం.

## బాక్సాఫీస్ వద్ద భారీ విజయం

'అనోరా' చిత్రాన్ని 6 మిలియన్ డాలర్ల బడ్జెట్‌తో ఇండిపెండెంట్ ఫిల్మ్‌గా తెరకెక్కించారు. కేవలం 40 మంది యూనిట్ సభ్యులు నిర్మాణంలో పాలుపంచుకున్నారు. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా 41 మిలియన్ డాలర్లు (దాదాపు 358) కోట్లు వసూలు చేసింది. ఎంతటి ఆధునిక సంపన్న దేశాలకు చెందిన కుటుంబాలైనా, వేశ్యను వారు చూసే దృష్టికోణం వక్రంగానే ఉంటుందని, వేశ్యలో దయార్ద్ర హృదయాన్ని సాధారణ సమాజం ఏనాటికీ అర్థం చేసుకోలేదని, వృత్తికంటే వారి వ్యక్తిత్వాలకు గౌరవమివ్వాలనే అంతర్లీన సందేశంతో 'అనోరా' ప్రేక్షకుల్ని మెప్పించింది. ప్రథమార్ధమంతా బోల్డ్ రొమాంటిక్ సన్నివేశాలతో ఉండే ఈ సినిమా ద్వితీయార్ధం లో భావోద్వేగభరితంగా సాగుతుంది. హాస్యం, వ్యంగ్యం ద్వారానే చక్కటి సామాజిక సందేశాన్ని అందించే ప్రయత్నం చేశాడు దర్శకుడు సీన్ బేకర్.

## చరిత్ర సృష్టించిన దర్శకుడు సీన్ బేకర్

ఒకే చిత్రానికి గాను నాలుగు అస్కార్ పురస్కారాలను దక్కించుకున్న దర్శకుడిగా సీన్ బేకర్ చరిత్ర సృష్టించారు. బెస్ట్ ఫిల్మ్, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ ఎడిటింగ్, బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే విభాగాల్లో ఆయన అవార్డులు గెలుచుకున్నారు. గతంలో 'పారసైట్' చిత్రానికిగాను దర్శకుడు బాంగ్ జూన్ హో సైతం నాలుగు పురస్కారాలను పొందారు. అయితే 'పారాసైట్' చిత్రం బెస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ కేటగిరీలో దక్షిణ కొరియా తరపున అవార్డు దక్కించుకోవడంతో సాంకేతికంగా ఆ విభాగాన్ని లెక్కలోకి తీసుకోలేదు. ఈ నేపథ్యంలో సీన్ బేకర్ ఆస్కార్ అవార్డుల చరిత్రంలో అరుదైన ఘనతను సాధించారు. అమెరికాకు చెందిన సీన్ బేకర్ ఇండిపెండెంట్ ఫిల్మ్‌మేకర్‌గా పేరు పొందారు. పేదలు, సెక్స్ వర్కర్ల జీవితాలు ప్రధాన ఇతివృత్తంగా ఆయన సినిమాలు తీశారు. టేక్ అవుట్, స్టార్‌లెట్, టాంజెరైన్, ది ఫ్లోరిడా ప్రాజెక్ట్, రెడ్ రాకెట్ వంటి చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపు తెచ్చాయి.

## భారత్‌కు నిరాశ మిగిల్చిన 'అనూజ'

ప్రియాంకచోప్రా నిర్మించిన 'అనూజ' చిత్రం లైవ్ యాక్షన్ షార్ట్‌ఫిల్మ్ కేటగిరీలో ఎంట్రీని దక్కించుకొని ఆశల్ని రేపింది. అయితే ఈ సినిమాకు నిరాశే మిగిలింది. ఆడమ్‌గ్రేవ్స్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా ప్రియాంక చోప్రాతో పాటు గునీత్ మోంగా, సుచిత్ర నిర్మించారు. సజ్జ పఠాన్, అనన్యా షాన్‌బాగ్, నగేష్ బోస్లే ప్రధాన పాత్రధారులు. 29 నిమిషాల నిడివితో రూపొందించారు. న్యూఢిల్లీలోని బట్టల మిల్లులో తన సోదరితో కలిసి పనిచేసే అనూజ అనే బాలిక కథ ఇది. బోర్డింగ్ స్కూల్‌లో చదువుకోవాలని తపించే అనూజ సంకల్పాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించారు. లైవ్ యాక్షన్ షార్ట్‌ఫిల్మ్ కేటగిరీలో 'ఐయామ్ నాట్ రోబో' సినిమా అవార్డును కైవసం చేసుకుంది.

'ది బ్రూటలిస్ట్' చిత్రానికిగాను ఆడ్రియన్ నికోలస్ బ్రాడీ ఉత్తమ నటుడిగా ఆస్కార్ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయనకిది రెండో ఆస్కార్ అవార్డు. గతంలో 'ది పియానిస్ట్' (2003) చిత్రానికిగాను ఆయన తొలిసారి ఆస్కార్ గెలుచుకున్నారు. నాజీల దురాగతాల నుంచి బయటపడి అమెరికాలో తన కలలను నెరవేర్చుకోవడానికి ఓ వ్యక్తి చేసే ప్రయాణం నేపథ్యంలో 'ది బ్రూటలిస్ట్' చిత్రాన్ని తెరకెక్కించారు. యుద్ధానంతరం వలస జీవుల బతుకు చిత్రం, వారి కుటుంబ సంఘర్షణల నేపథ్యంలో ఈ సినిమా ఆకట్టుకుంది. ఇక 'అనోరా' చిత్రంలో వేశ్య పాత్రలో నటించిన మైకీ మాడిసన్ రోస్‌బర్గ్ ఉత్తమ నటిగా పురస్కారాన్ని దక్కించుకుంది. లఘు చిత్రాల నటిగా కెరీర్‌ను ఆరంభించిన మైకీ మాడిసన్.. బెటర్ థింగ్స్, వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్, స్క్రీమ్ వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుంది.



సీన్ బేకర్ (అనోరా)

## ఈ ఏడాది ఆస్కార్ హైలైట్స్...

- ఆస్కార్ అవార్డుల వ్యాఖ్యాతగా వ్యవహరించిన కానన్ ఒబ్రెయిన్ భారతీయులను ఉద్దేశిస్తూ హిందీలో మాట్లాడారు. 'భారత ప్రజలకు శుభోదయం. అక్కడ మీకు ఉదయం కాబట్టి అల్పాహారం భుజిస్తూ ఆస్కార్‌ను వీక్షించండి' అంటూ తన వెల్‌కమ్ స్పీచ్‌ను ఇచ్చారు.
- హాలీవుడ్ నటి డారిల్ హన్నా ఆస్కార్ వేదికపై నుంచి ఉక్రెయిన్‌కు మద్దతు ప్రకటించారు. ఫిల్మ్ ఎడిటింగ్ విభాగంలో అవార్డును ప్రదానం చేయడానికి విచ్చేసిన ఆమె.. యుద్ధంలో ఉక్రెయిన్ విజయం సాధించాలని ఆకాంక్షించారు.
- ఆస్కార్ సంబరాల్లో ఉత్తమ నటుడు ఆడ్రియన్ బ్రాడీ రెడ్‌కార్పెట్‌పై హాలీవుడ్ నటి హల్లే బెర్రీని ముద్దు పెట్టుకోవడంతో అక్కడున్న వారంతా అవాక్కయ్యారు. 'ది పియానిస్ట్' (2003) చిత్రానికి తొలిసారి ఆస్కార్ గెలుచుకున్న సందర్భంలో కూడా ఆయన హల్లే బెర్రీని ఇదే తరహాలో ముద్దాడారు. 2003 సీన్ రిపీట్ అంటూ ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.
- ఆస్కార్ రెడ్‌కార్పెట్‌పై హాలీవుడ్ తారలు హొయలొలికించారు పాప్ సింగర్, నటి సెలీనా గోమెజ్ గులాబీ గౌనులో ప్రధానాకర్షణగా నిలిచారు. దాదాపు 16 వేల క్రిస్టల్స్‌తో ఈ గౌనును రూపొందించారు. ప్రస్తుతం ఈ డ్రెస్ సోషల్‌మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది.



సెలీనా గోమెజ్

## డ్యూన్ విజువల్ బృందంలో కేసముద్రంవాసి



కేసముద్రం, మార్చి 3: ఆస్కార్ అవార్డు కైవసం చేసుకున్న డ్యూన్ సినిమా బృందంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అమినాపురానికి చెందిన ఎడ్ల సుమంత్‌రెడ్డి ఉన్నాడు. ఈ చిత్రానికి విజువల్ ఎఫెక్ట్ అందించిన డీనెగ్ అనే సంస్థలో సుమంత్‌రెడ్డి పనిచేస్తున్నాడు. సుమంత్‌రెడ్డి జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో బీఎస్‌ఏ పూర్తి చేసి విజువల్ ఎఫెక్ట్ విభాగంలో పనిచేస్తున్నాడు. ఆస్కార్ అవార్డుకు ఎంపికైన చిత్రంలో సుమంత్‌రెడ్డి సభ్యుడిగా ఉండడంపై అమినాపురం గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## ఆస్కార్ విజేతల జాబితా

- **ఉత్తమ చిత్రం:** అనోరా
- **ఉత్తమ నటుడు:** ఆడ్రియన్ నికోలస్ బ్రాడీ (ది బ్రూటలిస్ట్)
- **ఉత్తమ నటి:** మైకీ మాడిసన్ రోజ్‌బర్గ్ (అనోరా)
- **ఉత్తమ దర్శకుడు:** సీన్ బేకర్ (అనోరా)
- **ఉత్తమ సహాయ నటుడు:** కీరన్ కల్కిన్ (ది రియల్ పెయిన్)
- **ఉత్తమ సహాయ నటి:** జోసల్దానా (ఎమీలియా పెరెజ్)
- **ఉత్తమ ఛాయాగ్రహణం:** లాల్ క్రాలే (ది బ్రూటలిస్ట్)
- **ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే:** సీన్ బేకర్ (అనోరా)
- **ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్:** పాల్ తేజ్‌వెల్ (విక్‌డ్)
- **ఉత్తమ మేకప్:** ది సబ్‌స్టాన్స్
- **ఉత్తమ ఒరిజినల్ సాంగ్:** ఎల్‌మాల్ (ఎమీలియా పెరెజ్)
- **ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్:** నాథన్‌క్రౌలీ, లీ శాండల్స్ (విక్‌డ్)
- **బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్:** డ్యూన్ పార్ట్-2
- **ఉత్తమ ఒరిజినల్ స్కోర్:** డేనియల్ బ్లూమ్‌బెర్గ్ (ది బ్రూటలిస్ట్)



# కడుపు మండిన కాకుల కథ

'చరిత్రలో అందరూ చిలకలు, పావురాలు గురించి రాసిన్రు గానీ.. గదే జాతిలో పుట్టిన కాకుల గురించి రాయలే.. ఇది కడుపు మండిన కాకుల కథ. జమానా జమానాకెళ్లి నడిచే శవాల కథ.. అమ్మరొమ్ములో పాలు లేక రక్తం బోసి పెంచిన ఓ జాతి కథ.. ఒక దగడ్ వొచ్చి మొత్తం జాతిలో జోష్ తెచ్చిండు. థూ అనిపించుకున్న కాకులు తల్వార్‌లు పట్టినాయ్.. ఆ కాకులని ఒకటి చేసిన తిరుగుబాటుదారుడి కథ ఇది.. ఓ యువకుడు నాయకుడిగా మారిన కథ..' నాని హీరోగా రూపొందుతోన్న 'ది ప్యారడైజ్' సినిమా 'రా స్టేట్మెంట్' గ్లింప్స్ ప్రారంభంలో వచ్చే వాయిస్ ఓవర్ ఇది. దీన్ని బట్టి ఈ సినిమా ఎలా ఉండబోతున్నదో చెప్పేశాడు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. మృతదేహాలు, మురికివాడలు, ఎగురుతున్న కాకులు.. ఓ అంతుచిక్కని ప్రపంచాన్ని చూపించాడు దర్శకుడు ఈ గ్లింప్స్‌లో. రగ్గడ్ లుక్‌తో చిత్రమైన బాడీ లాంగ్వేజ్‌తో, రెండు జడలతో ఆడియన్స్‌కి గూజ్‌బమ్స్ తెచ్చేలా నాని లుక్ ఉంది. ఈ సినిమాకోసం నాని మేకోవర్ అదిరిపోయింది. తిరుగుబాటు ప్రపంచంలో నాయకుడి ప్రయాణాన్ని చూపించిందీ గ్లింప్స్. వచ్చే ఏడాది మార్చి 26న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: జి.కె.విష్ణు, సంగీతం: అనిరుధ్ రవిచందర్, నిర్మాత: సుధాకర్ చెరుకూరి.

# తెలుగులో రిలీజ్ చేస్తున్నందుకు గర్విస్తున్నాం



ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితం ఆధారంగా రూపొంది.. బాలీవుడ్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఛావా' చిత్రం తెలుగు వెర్షన్ ఈ నెల 7న తెలుగు రాష్ర్టాల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో విక్కీకౌశల్ నట విశ్వరూపం చూపించిన ఈ సినిమాను ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ సంస్థ తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా సోమవారం ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ మరణం తర్వాత.. మొఘల్ ఆధిపత్య ముప్పును మరాఠా సామ్రాజ్యం ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తినప్పుడు.. శివాజీ వారసత్వం ఛత్రపతి శంభాజీ ద్వారా కొనసాగుతుంది. 'సింహం పోవచ్చు.. కానీ దాని పిల్ల ఇప్పటికీ అడవిలో వేటాడుతూనే ఉంది..' అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో శంభాజీ పాత్రని తెలుగు ప్రేక్షకులకు ట్రైలర్ ద్వారా పరిచయం చేశారు. శత్రువుల శక్తిసామర్థ్యాలు.. గెరిల్లా యుద్ధాలు.. శంభాజీ ధైర్యసాహసాలు.. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు కుయుక్తులు.. ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. ఔరంగజేబుగా అక్షయ్ ఖన్నా, శంభాజీ ఇల్లాలు యేసుబాయిగా రష్మిక మందన్నా ఈ ట్రైలర్‌లో అలరించారు. ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నందుకు గర్విస్తున్నామని, భాష ఏదైనా అది మంచి సినిమా అయితే దాన్ని తెలుగులోకి తీసుకురావడానికి గీతా ఆర్ట్స్ ఎప్పుడూ ముందే ఉంటుందని, తమ సంస్థ నుంచి వచ్చిన గజనీ, కాంతారా చిత్రాల మాదిరిగానే ఈ సినిమా కూడా విజయం సాధిస్తుందని నిర్మాత బన్నీ వాసు నమ్మకం వెలిబుచ్చారు.



# 100 కోట్ల క్లబ్‌లో చేరాం

'ప్రయత్నిస్తే కచ్చితంగా జరుగుతుంది అనే పాయింట్‌తో ఈ సినిమా స్టార్ట్ చేశాం. ఈ సినిమాకు వస్తున్న స్పందన చూసి, దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఎమోషనల్ అయ్యారు. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమకు ముగ్ధులం అయ్యాం. అడాప్టెడ్ సన్ అంటూ నామీద మీమ్స్ వస్తున్నాయి. నన్ను మీలో ఒకడిగా చేర్చుకున్నందుకు థ్యాంక్స్.' అన్నారు హీరో ప్రదీప్ రంగనాథన్. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్'. అనుపమా పరమేశ్వరన్, కయాదు లోహర్ కథానాయికలు. అశ్వత్ మారిముత్తు దర్శకుడు. కల్పాతి ఎస్.అఘోరం, కల్పాతి ఎస్.గణేష్, కల్పాతి ఎస్.సురేష్ నిర్మాతలు. గత నెల 21న విడుదలైన ఈ సినిమా వందకోట్ల క్లబ్‌లో జాయిన్ అయ్యింది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడారు. 'సినిమాలో ఎమోషన్ కనెక్టయితే.. అన్ని పాత్రలూ కనెక్టవుతాయి అని నిరూపించిన రాజమౌళీ నాకు స్ఫూర్తి. ప్రేమ, స్నేహం, తల్లిదండ్రులు అనేవి యూనివర్సల్ కాన్సెప్టులు. ఈ మూడూ ఈ సినిమాలో ఉంటాయి. అందుకే సినిమా అంత పెద్ద హిట్ అయ్యింది.' అని దర్శకుడు అశ్వత్ మారిముత్తు అన్నారు. ఇంకా చిత్ర నిర్మాతల్లో ఒకరైన కల్పాతి అర్చనతో పాటు మైత్రీ అధినేతల్లో ఒకరైన యలమంచిలి రవిశంకర్, మైత్రీ శశిధర్, సంగీత దర్శకుడు లియోన్ జేమ్స్ కూడా మాట్లాడారు.

## ఉత్కంఠకు గురిచేసే

# సాహస యాత్ర ఇది



'సముద్రతీరంలో ఓ ఊరు.. ఆ ఊరులో బతికే జాలర్లలో నేనూ ఒకడ్ని. సాధారణంగా జాలర్లు సముద్రంలోకి వేటకు వెళ్తుంటారు. కానీ ఆ ఊరిలో జాలర్లు వేటకు వెళ్లరు. కారణం ఓ శాపం. ఆ శాపం ఏంటి? శాపాన్ని ఎదిరించి హీరో సముద్రంలోకి ఎలా వెళ్లాడు? అక్కడ ఏం జరిగింది? అనేది ఉత్కంఠకు గురిచేస్తుంది. ఇండియాలో వస్తున్న తొలి సీ అడ్వెంచర్ థ్రిల్లర్ ఇది.' అని తెలిపారు హీరో జీవి ప్రకాష్‌కుమార్. ఆయన కథానాయకుడి నటిస్తూ.. జీ స్టూడియోస్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'కింగ్‌స్టన్'. కమల్ ప్రకాష్ దర్శకుడు. గంగా ఎంటర్టైన్మెంట్స్ అధినేత మహేశ్వర్‌రెడ్డి చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా జీవీ ప్రకాశ్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు. 'ఇది డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా. సముద్రంలోకి వెళ్లాక హీరోలకు జాంబీలు ఎదురవుతారు. అలాగే ఆత్మలు కూడా వెంటాడతాయి. ఈ సాహసయాత్ర ఆద్యంతం ఉత్కంఠకు లోను చేస్తుంది. 'బాహుబలి' ప్రేక్షకులను రాజులకాలం నాటి ప్రపంచంలోకి తీసుకెళ్తే.. 'కాంతారా' ఓ స్పిరిచువల్ వరల్డ్‌ని ఆవిష్కరించింది. వాటి మాదిరిగానే ఈ సినిమా కూడా ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. అందరం ప్రాణం పెట్టి చేశాం. సాంకేతికంగా అద్భుతంగా ఉంటుందీ సినిమా.' అని చెప్పారు జీవీ ప్రకాశ్‌కుమార్.

# కావాలంటే పేపర్‌పై రాసిస్తా..

'యానిమల్' సినిమా విడుదలైన నాటి నుంచి విమర్శల పర్వం నడుస్తూనే ఉంది. వాటిపై దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కౌంటర్లు ఇస్తూనే ఉన్నారు. రీసెంట్‌గా ఐఏఎస్ అధికారి వికాస్ దివ్యకీర్తికి సందీప్ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. 2023లో '12th ఫెయిల్' అనే సినిమాలో నటించారు వికాస్ దివ్యకీర్తి. ఆ సినిమా ప్రమోషన్లో భాగంగా.. సమాజానికి ఇలాంటి సందేశాత్మక చిత్రాలు అవసరమని, 'యానిమల్' లాంటి సినిమాలు అక్కర్లేదని, అలాంటి సినిమాలవల్ల డబ్బు మాత్రమే సంపాదించగలమని, సినిమా తీసే ముందు సామాజిక విలువల పాటిస్తే బాగుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కామెంట్లపై తన రీసెంట్ ఇంటర్వ్యూలో స్పందించారు సందీప్‌రెడ్డి వంగా. 'ఓ మాజీ ఐఏఎస్ అధికారి నా 'యానిమల్' సినిమాపై చేసిన వ్యాఖ్యలు నాకింకా గుర్తున్నాయి. అవి నన్నెంతో బాధించాయి కూడా. అసలు అలాంటి సినిమాలు రాకూడదని అతని అభిప్రాయం. ఆ విమర్శలు నిజంగా నాకు కోపం కూడా తెప్పించాయి. నేను అలాంటి వారికి చెప్పేదొక్కటే. ఐఏఎస్ కావాలంటే కష్టపడి చదివితే చాలు. కానీ ఫిల్మ్ మేకర్ కావాలంటే అభిరుచితో ముందుకు సాగాలి. నీకు నువ్వుగా అన్నీ నేర్చుకోవాలి. ఇక్కడ ఎలాంటి కోర్సులు, టీచర్లు ఉండరు. ఇదే విషయాన్ని కావాలంటే పేపర్‌పై కూడా రాసిస్తా.' అని ఘాటుగా స్పందించారు సందీప్‌రెడ్డి వంగా. ఇంకా తాను రూపొందించనున్న 'స్పిరిట్' సినిమా గురించి మాట్లాడుతూ 'నాకు 'బాహుబలి'ని దాటాలని లేదు. అలా చేయాలంటే నా సినిమా 2000కోట్ల కలెక్షన్స్ రాబట్టాలి. అది చాలా పెద్ద విషయం. ఇప్పటికైతే ఓ మంచి సినిమా చేస్తా. అది ఎంత కలెక్ట్ చేస్తుందనేది చూడాలి.' అంటూ సింపుల్‌గా ముగించారు సందీప్‌రెడ్డి వంగా.



